# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 18 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## 588 కుటుంబాల్లో కారుణ్య నియామకాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో 588 కుటుంబాల్లోని సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఉద్యోగుల కుటుంబాలకు ఉపశమనం కలిగించే చర్యలో భాగంగా తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ చర్యలు చేపట్టింది. పలు కుటుంబాల దుస్థితిని వివరిస్తూ తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) చైర్మన్ ఎం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎలూరి శ్రీనివాసరావు చేసిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కుటుంబాలకు జీవనోపాధిని కలిగించటానికి సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించింది.

## అసెంబ్లీలో ఐదు కీలక బిల్లులు



- ప్రవేశపెట్టిన మంత్రులు పొన్నం, దామోదర, కొండా
- బీసీ బిల్లుకు బీఆర్ఎస్, బీజేపీ ఆమోదం
- బడ్జెట్‌లో రూ. 20వేల కోట్లు కేటాయించాలన్న హరీశ్ రావు
- సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీగా పేరు మార్పు
- పేరు ఎందుకు మార్చాల్సి వచ్చిందని బీజేపీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీ బడ్జెట్ సమావే శాలు నాల్గో రోజు బడ్జెట్ ప్రభు త్వం ఐదు కీలక బిల్లులు ప్రవేశపెట్టింది. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూ నివర్సిటీగా మారుస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించారు. అలాగే బీసీలకు విద్య, ఉద్యో గాలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఒక బిల్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్ కల్పిస్తూ మరో బిల్లును ప్రవేశపెట్టారు. దేవాదాయ చట్ట సవరణ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. బిల్లులను ప్రవేశపెట్టే ముందుకు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పీకర్ అనుమతి కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుమతితో స్థానిక సంస్థలో బీసీ రిజర్వేషన్ల బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ వర్గీకరణ బిల్లు, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ చట్ట సవరణ బిల్లలను మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ చట్ట సవరణ బిల్లును శాఖ మంత్రి కొండా సురేఖ సభలో ప్రవేశపెట్టారు. బీసీ లకు స్థానిక సంస్థ టో విద్యా, ఉద్యోగాలో 42

బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను తెలంగాణ శాసనసభ ఆమోదించింది. ఇవి పార్లమెంట్‌లో చట్ట రూపం దాల్చితే విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లభించను న్నాయి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసన సభ ప్రారంభం కాగానే రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లులపై చర్చను ప్రారంభిస్తూ ఏండ్లుగా బీసీలు అన్యాయానికి గురవుతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు తమ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బిల్లులను ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు మద్దతివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, బీజేపీ నుంచి పాయల్ శంకర్‌తో పాటు అధికార పక్షం నుంచి బీర్ల ఐలయ్య, వాకిటి శ్రీనివాస్, రాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'బీసీ రిజర్వేషన్ బిల్లుల చట్టబద్ధత కోసం జరిగే ఉద్యమానికి ఢిల్లీలో నేనే నాయకత్వం వహిస్తా. రాజకీయాలకతీతంగా బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పక్షాలు బీసీ బిల్లుకు శాసనసభలో సంపూర్ణ మద్దతు ప్రకటించడం హర్షణీయం...తమిళనాడు తరహాలో యావత్ తెలంగాణ ఒక్కటై కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. అవసరమైతే రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌లో కొట్లాడుదాం' అని పిలుపునిచ్చారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శాసనసభలో సోమవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రెండు వేర్వేరు బిల్లులపై సీఎం మాట్లాడారు. ఢిల్లీలో దీన్ని పట్టాలెక్కించే బాధ్యతను నేనే తీసుకుంటానని స్పష్టం చేశారు. అందుకు బీజేపీ నేతలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రధాని అపాయిమెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. "రాహుల్ గాంధీని కలిసి పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరుదాం. వారి సమయం తీసుకునే బాధ్యతను మా పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు అప్పగిస్తున్నా. అవసరమైతే రాజ్యాంగ సవరణ కోసం కొట్లాడుదాం. ఇప్పటి వరకు వంద సార్లకు పైగా రాజ్యాంగ సవరణ జరిగింది. దేశంలో కుల గణన సర్వే 1931లో జరిగింది. ఆ తర్వాత మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వారికి 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదు" అని సీఎం పేర్కొన్నారు.

మిగితా 2వ పేజీలో

# రాజకీయాలకతీతంగా కలిసి పోరాడాలి

- నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నాను
- రాజకీయ పార్టీల నాయకులందరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలుద్దాం
- రాజ్యాంగాన్ని సవరించైనా బీసీ రిజర్వేషన్లు
- విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకు నాయకత్వం వహిస్తా!
- బీసీలు పాలితులు కాదు.. పాలకులు కావాలి
- సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అందుకు నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే వరకు విశ్రమించేది లేదని శాసనసభ వేదికగా స్పష్టం చేశారు.బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, అలాగే రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సంబంధించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో ప్రతిపాదించిన రెండు వేర్వేరు బిల్లుపై ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఈ విషయంలో రాజకీయ పార్టీల నాయకులందరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలుద్దామని చెప్పారు. అందుకు ప్రధాన ప్రతిక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో పాటు అందరం కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళదామని అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వీలైనంత తొందరగా ప్రధాని మోడీని కలవడానికి ప్రయత్నిద్దామని చెబుతూ, అందుకు సంబంధించి వారి అపాయింట్ మెంట్ కోరుతూ లేఖ రాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ప్రధానమంత్రి గారితో పాటు లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారిని కలిసి అన్ని విషయాలు వివరించి పార్లమెంట్ లో ఈ అంశాన్ని చర్చించడంతో పాటు సహకరించాలని కోరుదామని అన్నారు. శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లుకు మద్దతుగా రాజకీయాలకు అతీతంగా, సిద్ధాంతాలకు అతీతంగా జెండాలు, ఎజెండాలకు అతీతంగా బలహీన వర్గాలకు అండగా ఏకాభిప్రాయంతో నిలబడ్డాయని ఒక సందేశాన్ని పంపించడంలో సహకరించినందుకు ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.

శాస్త్రీయ పద్ధతిలో బీసీల గణాంకాలు తేల్చకుండా రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని సుప్రీంకోర్టు చెబుతున్నందున, దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో పారదర్శకంగా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను చేసి లెక్కలు తేల్చిందని వివరించారు. బీసీ కులగణన విషయంలో 4 ఫిబ్రవరి 2024 మంత్రిమండలి తీర్మానంతో ప్రారంభించి సరిగ్గా ఏడాది పూర్తయ్యేలోగా తిరిగి 4 ఫిబ్రవరి 2025 న శాసనసభలో తీర్మానం ఆమోదించే వరకు జరిగిన ప్రక్రియను ముఖ్యమంత్రి గారు వివరించారు. అందుకు గుర్తుగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 4 న సోషల్ జస్టిస్ డేగా నిర్వహించుకోవాలని శాసనసభ ఆమోదించిన విషయాన్ని గుర్తుచేశారు. "ప్రభుత్వం నిర్వహించిన సర్వే తేల్చిన లెక్క నూటికి నూరు శాతం కరెక్ట్. ఈ సర్వే ప్రకారం బలహీనవర్గాలు 56 శాతం ఉన్నట్టు తేలింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గతంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. ఇప్పుడు బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా చట్టబద్ధత కల్పిస్తున్నాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే వరకు విశ్రమించేది లేదు" అని అన్నారు.

రాష్ట్ర విభజన అనంతరం పరిపాలనా సౌలభ్యం, రెండు రాష్ట్రాల్లో సంస్థలకు ఒకే పేరు కారణంగా ఎదురవుతున్న గందరగోళానికి తెరదించాలన్న ఉద్దేశంతో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరును పెడుతున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత పదేళ్లుగా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, విధివిధానాలు పరిశీలించిన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయ పేరు మార్పును ప్రతిపాదించామని చెప్పారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్పు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుపై శాసనసభలో ముఖ్యమంత్రి స్పందించారు. పొట్టి శ్రీరాములు గారు స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మ గాంధీ గారి స్ఫూర్తితో పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాల ద్వారానే మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిందని గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములు పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. వారి దేశభక్తి, ప్రాణత్యాగం మరువలేనిదని అన్నారు."తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన ప్రముఖులను మనం స్మరించు కుంటున్నాం, వారి పేర్లను మన విద్యా సంస్థలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు పెట్టుకుంటున్నాం. ఈ విషయంలో కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం మంచిది కాదు.

రాష్ట్ర విభజన తర్వాత ఆయా భౌగోళిక ప్రాంతాల్లో ఉన్న యూనివర్సిటీలు ఆయా రాష్ట్రాల పరిధిలోకి వెళ్లగా, ఆ ప్రక్రియలో భాగంగా యూనివర్సిటీలకు కొత్త పేర్లు పెట్టుకోవడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా ఉండగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ గారి పేరు కొనసాగిస్తున్నారు.

మిగితా 2వ పేజీలో

## చర్లపల్లి స్టేషన్‌కు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు

### రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి లేఖ రాసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది వేసిన పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరిస్తూ చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు వారి పేరును పెట్టాలని తెలంగాణ ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి గారు ఆ లేఖలో పేర్కొన్నారు.

తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు, సంస్కృతికి గర్వకారణమైన పొట్టి శ్రీరాములు గారు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల కోసం వారు ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు ఉండాలని పోరాడిన పొట్టి శ్రీరాములు గారు చేసిన ఆమరణ నిరాహార దీక్ష వారి నిస్వార్థ త్యాగానికి, తెలుగువారికి గర్వకారణంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ రైల్వే టర్మినల్ ఏర్పాటు ద్వారా తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనలో అదనపు ప్రయోజనం చేకూర్చిందని, తెలంగాణ రైజింగ్ దార్శనికతకు ఇదెంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న తమ లక్ష్య సాధనకు ఈ కొత్త రవాణా కేంద్రం ఉపయుక్తంగా చేశారంటూ రైల్వే మంత్రి గారికి ముఖ్యమంత్రి గారు అభినందనలు తెలియజేశారు.

తెలుగు ప్రజల కోసం పొట్టి శ్రీరాములు గారు చేసిన త్యాగాలకు గుర్తుగా చెర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు వారి పేరును పెట్టి గౌరవించుకోవలసిన అవసరం ఉందని, వారి అసమాన అంకిత భావానికి నివాళిగా భావిస్తున్నామని అన్నారు. మా విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని రైల్వే టెర్మినల్ స్టేషన్ పేరును మార్చాలని కోరుతున్నాం. ఈ విషయంలో మీరందించే సహకారం ఒక గొప్ప అడుగు అవుతుంది. తెలంగాణ ప్రజలు, తెలుగు మాట్లాడే ప్రజలందరూ దీనిని ఎంతగానో అభినందిస్తారు. మా విజ్ఞప్తి విషయంలో సానుకూలంగా స్పందిస్తారని.. ఆ లేఖలో ముఖ్యమంత్రి గారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామక పరీక్ష తుది ఫలితాలు విడుదల అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో 581 సంక్షేమ వసతి గృహాల అధికారుల ఉద్యోగాలకు ఎంపిక అయిన అభ్యర్థుల తుది జాబితాను టీజీపీఎస్సీ ప్రకటించింది. ఈ నెల 10వ తేదీన గ్రూప్ 1, 11న గ్రూప్ 2 ఫలితాలు, 14 గ్రూప్ 3 విడుదల చేసిన టీజీపీఎస్సీ షెడ్యూల్ ప్రకారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తుది ఫలితాలు విడుదల చేసింది. మొత్తం 581 పోస్టులకు గాను 574 మందిని ఎంపిక చేసినట్లు టీజీపీఎస్సీ విడుదల చేసిన ప్రొవిజినల్ సెలెక్షన్ నోటిఫికేషన్‌లో తెలిపింది. వీరిలో 561 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 1, 2, లేడీ సూపర్ వైజర్ పోస్టులకు ఎంపిక అయ్యారు. 13 మంది వార్డెన్, మాట్రన్ గ్రేడ్ 1, గ్రేడ్–2 పోస్టులకు ఎంపిక అయ్యారని టీజీపీఎస్సీ తెలిపింది. ఎంపిక అయిన అభ్యర్థులకు సంబంధించి ఉద్యోగ నోటిఫికేషన్, నిబంధనలకు అనుగుణంగా ఎంక్వైరీ సహా తదుపరి ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.581 సంక్షేమ వసతి గృహాల అధికారుల పోస్టులకు గత సంవత్సరం జూన్ 24 నుంచి 29 వరకు కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలు (సీబీఆర్‌టీ) నిర్వహించిన అధికారులు ఆ తరువాత ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకు మొత్తంగా 1,45,359 మంది దరఖాస్తు చేసుకున్నారు, 82,000 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు.

## ఇది గాంధీ భవన్ కాదు.. అసెంబ్లీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సభ నిర్వహణపై ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా.. అధికార పక్షానికే ఎక్కువ సమయం కేటాయించడాన్ని ఓవైసీ తప్పుబట్టారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. సభలో మాట్లాడుదామంటే మైక్ ఇవ్వరు. అధికార పక్షం ఇలా చేయడం మంచిది కాదు. శాసనసభను నడపడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదు. ప్రశ్నలు కూడా మార్చుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం. ఇది గాంధీ భవన్ కాదు.. అసెంబ్లీ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీ భవన్‌లా కాదు అని ఎమ్మెల్యే ఓవైసీ సూచించారు. అనంతరం తెలంగాణ అసెంబ్లీ నుంచి ఎంఐఎం ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సభ నడుపుతున్న తీరును నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తెలిపారు.

## "రాజీవ్ యువ వికాసం" ప్రారంభం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆలోచనతో 6 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం "రాజీవ్ యువ వికాసం" కార్యక్రమాన్ని చేపట్టిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. స్వయం ఉపాధి కింద అసలైన, అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ పథకం ప్రయోజనం చేకూరాలని స్పష్టం చేశారు. జూన్ 2 వ తేదీన 5 లక్షల మంది లబ్దిదారులను ప్రకటిస్తామన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమాన్ని శాసనసభ ప్రాంగణంలో ముఖ్య మంత్రి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రివర్గ సహచరులు, ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధుల సమక్షంలో ముఖ్యమంత్రి గారు ఈ పథకాన్ని ప్రారంభించారు.

అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, పథకం ప్రధాన ఉద్దేశాలను విడమరిచి చెప్పారు. "నైపుణ్యం ఉండీ ఉద్యోగం లభించని యువతకు ఈ పథకం కింద ప్రాధాన్యత కల్పించాలి. పారదర్శకంగా ఉండాలి. అర్హులు, నిజమైన నిరుద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఉద్దేశించిన ఈ పథకం ముందు ముందు మరింత పటిష్టంగా అమలు చేస్తాం. అర్హులైన యువతీ యువకులను ఎంపిక చేయడానికి ప్రజా ప్రతినిధులు మండలాల వారిగా సమావేశాలు నిర్వహించుకోవాలి. ఈ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 4 నుంచి 5 వేల మందికి ఉపాధి కల్పించవచ్చు. ఈ పథకం ద్వారా అర్హత ఉన్న వారికి 50 వేల నుంచి 4 లక్షల వరకు సహాయం అందించవచ్చు. ఇవ్వగలిగిన చోట ఉద్యోగాలు ఇస్తున్నాం. అవకాశాలున్న చోట ఉపాధి కల్పిస్తున్నాం. నైపుణ్యాన్ని నేర్పించాల్సిన చోట వృత్తి నైపుణ్య శిక్షణనిస్తున్నాం.

రాష్ట్రంలో 57 వేలకుపైగా ఉద్యోగాలు ఇవ్వడంలో ఎక్కడా చిన్న పొరపాటు జరక్కుండా పారదర్శకంగా భర్తీ చేశాం. 22 వేల మంది టీచర్ల ప్రమోషన్లు, 30 వేల టీచర్ల బదిలీల్లో ఎక్కడా చిన్న ఆరోపణ రాకుండా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి జరగని బదిలీల ప్రక్రియను పూర్తి చేశాం. రాష్ట్రంలో సమస్యలను ఒకటొకటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నాం. గతంలో నచ్చితే నజరానా నచ్చకపోతే జురిమానా విధానం ఉండేది. కానీ ప్రజా ప్రభుత్వం అలాంటి విధానానికి స్వస్తి పలికి స్పష్టమైన, విధానపరమైన నిర్ణయాలతో పరిపాలనను ప్రక్షాళన చేస్తూ ఒక పారదర్శకమైన పరిపాలన అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

## తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ శుభవార్త

- మార్చి 24 నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. ఇకపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. మార్చి 24వ తేదీ నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రజాప్రతినిధులను అప్పటి టీటీడీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించే విధానం అమలు కానుంది. సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం కేటాయింపు ఉంటుంది. అలాగే బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం ఉంటుంది. ఒక ప్రజాప్రతినిధి తాలూకు ఒక సిఫార్సు లేఖపై ఆరుగురికి మించకుండా దర్శన అవకాశం కేటాయించనుంది. ఏపీ ప్రజా ప్రతినిధులకు ఇకపై సోమవారం దర్శనానికి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. దానికి బదులుగా ఆదివారం దర్శనం కోసం శనివారం నాడు టీటీడీ లేఖలు స్వీకరించనుంది. సుదీర్ఘంగా చర్చించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ వెల్లడించింది. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి సహకరించాలని భక్తులను టీటీడీ కోరింది.



ఫైల్‌ఫోటో

## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోని డీ1, డీ2 ప్రదేశాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. టన్నెల్లో చిక్కుకున్న మిగిలిన ఏడుగురిని గుర్తించడానికి రెస్క్యూ ఆపరేషన్ 24వ రోజుకు చేరుకున్నది. డీ1 ప్రదేశంలో నీటి ఊట భారీగా రావడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందిగా మారింది. ఏడుగురి మృతదేహాలను గుర్తించడానికి సోమవారం ఉదయం రెస్క్యూ బృందాలతో పాటు కేరళకు చెందిన క్యాడర్ డాగ్స్ లోపలికి వెళ్లాయి. సోమవారం ఎస్–ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ , సహాయక బృందాల ఉన్నతాధికారులతో సహాయక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్నవారు ఉన్న ప్రదేశంగా డీ1, డీ2 ప్రదేశాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేశామన్నారు. సహాయక చర్యల్లో అడ్డంకి గా మారుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ భాగాలను తొలగించే పనులు కొనసాగిస్తూ, ఎస్కావేటర్, రెట్టింపు సహాయక బృందాలతో మట్టిని తొలగించే పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ర్యాట్ హెూల్ మైనర్స్ బృందాలు, డీ 1, డీ2 ప్రదేశాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు తెలియజేశారు . ప్రమాద ప్రదేశంలో నీటిని తొలగించేందుకు డి–వాటరింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీమ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ర్యాట్ హెూల్ మైనర్స్, క్యాడర్ డాగ్స్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే, జీఎస్ఐ, బృందాల అధికారులు పాల్గొన్నారు.



## మహిళా జర్నలిస్టులకు బెయిల్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల అరెస్టయిన జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్‌లకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ప్రతి సోమ, శుక్రవారం విచారణకు హాజరు కావాలని కోర్టు వారిని ఆదేశించింది.

# ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులను జైలుకు పంపుతారా

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కేటీఆర్**

**చంచల్ గూడ జైల్లో జర్నలిస్టులలకు కేటీఆర్ పరామర్శ**

**బలగం టీవి, హైదరాబాద్**



అక్రమ కేసులతో ఆడబిడ్డలను జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ అనే పిచ్చోడి చేతిలోని రాయిలెక్క తెలంగాణ మారిందని విమర్శించారు. 420 బూటకపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందన్న కోపంతో ముఖ్యమంత్రికి అర్థం కావడానికి ఆయన మాట్లాడే బజారు భాషలోనే జనం నిలదీస్తున్నారని చెప్పారు. చంచల్ గూడ జైల్లో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్‌లను బీఆర్ఎస్ సీనియర్ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. అలాగే జర్నలిస్టుల కుటుంబసభ్యులను ఓదార్చారు. రేవతి, తన్వి యాదవ్ తరపున న్యాయపోరాటం చేస్తామని హామి ఇచ్చారు.


అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే జర్నలిస్టులపై ముఖ్యమంత్రి అక్కసు వెళ్ళగక్కుతున్నారని మండిపడ్డారు. జనం నిలదీస్తే ..ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కు పాదం మోపుతారా? జైలుకు పంపుతారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్న డిజిటల్ జర్నలిస్టులపై అక్రమ కేసులు, దాడులతో వేధించడం ప్రజాస్వామ్య హననమే" అన్నారు. ఒకరిద్దరు జర్నలిస్టులపైనే కాదు పదుల సంఖ్యలో జర్నలిస్టులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేధిస్తుందని కేటీఆర్ ఆరోపించారు. తాను ఎంతో గొప్పగా చెప్పిన మొహబ్బత్‌కి దుకాన్ అంటే ఇదేనో కాదో చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను బట్టలూడదీసి కొడ్తానని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. రేవంత్ నియంతత్వ పోకడలను అడ్డుకోకుండే రేపు మిగతా జర్నలిస్టులకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి అక్రమాలపై మీడియా గొంతు విప్పి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులే అన్న సంగతి మరోసారి స్పష్టం అయిందన్నారు.

తన భార్యా పిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న రేవంత్ రెడ్డి గతంలో తమ మీద అడ్డగోలుగా అవాస్తవాలు మాట్లాడిన సంగతి మర్చిపోయారా అని పశ్నించారు. తన పిల్లల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు రేవంత్‌కు కుటుంబం గుర్తుకురాలేదా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 71 వేల కోట్ల ఆదాయం తగ్గిందన్న రేవంత్ రెడ్డి, అన్ని రంగాల్లో తెలంగాణ విఫలమైన సంగతిని స్వయంగా ఒప్పుకున్నారని చెప్పారు. తెలంగాణ రైజింగ్ కాదు తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అన్న చేదు నిజాన్ని ముఖ్యమంత్రి కన్ఫర్మ్ చేశారన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

**ముగ్గురు రంగారెడ్డి జిల్లా వాసులు మృతి**

**బలగం టీవి, హైదరాబాద్**





అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు (భారత కాల మానం ప్రకారం) జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. టేకులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ వెలిమర్తి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పవిత్రదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు ప్రగతిరెడ్డిని సిద్దిపేట జిల్లా బక్రీ చెప్యాలకు చెందిన రోహిత్‌రెడ్డికిచ్చి వివాహం జరిపించారు. ప్రగతిరెడ్డి, రోహిత్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రోహిత్‌రెడ్డి తల్లి సునీత కూడా వీరితోపాటే అమెరికాలో ఉంటున్నారు.

వీరంతా ఫ్లోరిడా నుంచి కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రగతిరెడ్డి(35), ఆమె కుమారుడు అర్విన్(6), అత్త సునీత(56) అక్కడికక్కడే మృతిచెందారు. భర్త రోహిత్‌రెడ్డి, మరో కుమారుడు గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో టేకులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ప్రగతిరెడ్డి తల్లిదండ్రులు మోహన్‌రెడ్డి, పవిత్రదేవి, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వీరిని గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. అనంతరం మోహన్‌రెడ్డి దంపతులు అమెరికాకు బయలుదేరి వెళ్లారు. మృతుల దహన సంస్కారాలు అమెరికాలోని ఫ్లోరిడాలోనే నిర్వహిస్తామని వారు తెలిపారు.

## ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ప్రధాని అపాయింట్‌మెంట్ కోరుతూ ఆయన లేఖ రాశారు. అఖిలపక్ష సమావేశానికి సమయమివ్వాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్, సీపీఐ పార్టీలతో కూడిన ప్రతినిధులతో వచ్చి కలుస్తామని, అందుకు సమయం ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును శాసనసభ ఆమోదించిన విషయాన్ని ఈ లేఖలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కావాలని కోరారు. రాష్ట్రంలోని విద్య, ఉద్యోగాలలో, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా తీసుకువచ్చిన రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది.

# కల్యాణమస్తు స్కీం ఏది : ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవి, హైదరాబాద్**



పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణమస్తు స్కీం కింద తులం బంగారం ఇస్తామన్న హామీని రేవంత్ రెడ్డి సర్కార్ నిలుపుకోలేకపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మ్యానిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానం అని రేవంత్ రెడ్డి పలుమార్లు చెప్పారు. అది అబద్ధమని శాసనమండలి సాక్షిగా బయటపడింది. కల్యాణమస్తు పథకం ద్వారా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని అన్నారు. కల్యాణమస్తు పథకం గురించి మేం అడిగిన ప్రశ్నకు ఆ పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచన లేదని కౌన్సిల్ సాక్షిగా సమాధానం చెప్పారు. ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతూన్నారు అని కవిత ధ్వజమెత్తారు. మహిళల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కవిత మండిపడ్డారు. ఆడపిల్లలకు అండగా కేసీఆర్ నిలబడ్డారు. తల్లిదండ్రులకు అండగా పాప పుట్టినప్పటి నుండి పెళ్లి అయ్యే వరకు కేసీఆర్ వారికి వెన్నుదన్నుగా నిలి చారు. మహిళ వ్యతిరేక ముఖ్యమంత్రిగా చరిత్రలో రేవంత్ రెడ్డి నిలు స్తాడు. నిన్న అసెంబ్లీలో కూడా సీఎం రేవంత్ రెడ్డి మహిళల పట్ల దురు సుగా మాట్లాడారు అది చీకటి రోజుగా భావిస్తున్నామని కవిత పేర్కొన్నారు.

# రాజకీయాలకతీతంగా కలిసి పోరాడాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో దానికి శ్రీ కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీగా నామకరణం చేసుకున్నాం.ఇలా మార్చడం వల్ల ఎన్టీఆర్ గారిని అగౌరవపరిచినట్టు కాదని, రెండు రాష్ట్రాల్లో ఒకే పేరుతో యూనివర్సిటీలను కొనసాగిస్తే పరిపాలనలో గందరగోళం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో హెల్త్ యూనివర్సిటీ పేరును కాళోజీ నారాయణరావు గారి పేరును పెట్టుకున్నాం.

ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా నామకరణం చేసుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న వ్యవసాయ వర్సిటీ రంగా గారి పేరుతో కొనసాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌లో యధాతథంగా కొనసాగుతుండగా, తెలంగాణలో హార్టికల్చర్ వర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ గారి పేరు పెట్టుకున్నాం. తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ కొనసాగుతుండగా తెలంగాణలో వెటర్నరీ యూనివర్సిటీకి స్వర్గీయ పీవీ నరసింహారావు గారి పేరును పెట్టుకున్నాం.ఈ కోవలోనే రాష్ట్ర విభజన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు గారి పేరుతో కొనసాగుతుండగా, తెలంగాణలో సురవరం ప్రతాప రెడ్డి గారి పేరును ప్రతిపాదించాం. ఈ మార్పు ఒక వ్యక్తి కోసమో, కుటుంబం కోసమో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదు. మిగతా యూనివర్సిటీలకు పేర్లను ఎలా మార్చుకున్నామో అదే తరహాలో తెలుగు విశ్వవిద్యాలయానికీ మార్పు ప్రతిపాదన చేశాం.

ఆరోజుల్లో తెలంగాణకు అసలు భాషనే లేదని అవహేళన చేసిన సందర్భంలో 354 మంది తెలంగాణ కవుల సంచికగా గ్రంధాన్ని తీసుకొచ్చారు. గోల్కొండ పత్రికను ప్రారంభించి ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని సురవరం ప్రతాప రెడ్డి గారు ముందుండి నడిపించారు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీఎస్ ఆర్టీసీని టీజీఆర్టీసీగా, ఏపీఐఐసీని టీజీఐఐసీగా, ఏపీపీఎస్సీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా మార్చుకున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత పరిపాలనలో భాగంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న ఉద్దేశంతో యూనివర్సిటీల పేర్లకు మార్పులు చేశాం. ఈ నిర్ణయాల్లో ఎవరినో కించ పరచాలన్న ఉద్దేశం కాదు. పరిపాలన పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని, రాష్ట్ర విశాల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. పొట్టి శ్రీరాములు గారు, మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ రోశయ్య గారి పట్ల, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, నమ్మకం, విశ్వాసం ఉంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో కలిసి ఇటీవల చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఒక హబ్‌గా తీర్చిదిద్దుకున్న నేపథ్యంలో ఆ స్టేషన్‌కు పొట్టి శ్రీరాములు పేరును పెట్టి ఆ ప్రముఖుడి త్యాగాలను స్మరించుకుందాం. ఈ విషయంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి గారు, బండి సంజయ్ గారు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి. అలాగే, ప్రముఖ నాయకులు రోశయ్య హైదరాబాద్‌లో నివాసమున్న ఇంటికి సమీపంలోని బల్కంపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయానికి రోశయ్య గారి పేరును పెట్టాలని ప్రతిపాదిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సుదీర్ఘ అనుభవజ్ఞులు, ముఖ్యమంత్రిగా గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించిన రోశయ్య గారి పేరును పెట్టడం సమంజసం. రోశయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా చేస్తున్న నేపథ్యంలో ఆ చికిత్సాలయంలో రోశయ్య గారి విగ్రహం ఏర్పాటు చేస్తాం. తద్వారా వారి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవచ్చు. ఈ రెండు చర్యల ద్వారా ఆర్యవైశ్యుల పట్ల ఉన్న ప్రత్యేక అభిమానాన్ని నిరూపించుకుందాం..." అని ముఖ్యమంత్రి చెప్పారు.

# అసెంబ్లీలో ఐదు కీలక బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు 37 శాతం రిజర్వేషన్లు కలించాలని శాసన సభ తీర్మానం చేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించిందని గుర్తు చేశారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఆ తీర్మానాన్ని ఉప సంహరించుకుంటున్నామని సీఎం తెలిపారు.

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తాము కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించామని సీఎం తెలిపారు. ఆ క్రమంలో ఆయా వర్గాల రిజర్వేషన్లను పెంచేందుకు కులగణన చేపట్టి విజయవంతంగా పూర్తి చేసినట్టు వివరించారు. "దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో సర్వే పారదర్శకంగా జరిగింది .రెండు దఫాల్లో చేపట్టిన సర్వేలో 3,55,50,759 మంది వివరాలు అందించారు. అందులో బీసీల సంఖ్య 56.36 శాతంగా తేలింది. సభా నాయకుడిగా అసెంబ్లీలో నేను మాట ఇస్తున్నా. సర్వేలో పొందుపరిచిన బీసీల లెక్క వందశాతం సరైంది. 2024 ఫిబ్రవరి 4న సర్వే మొదలు పెట్టి 2025 ఫిబ్రవరి 4న పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్‌డేగా సభ ద్వారా తీర్మానించి నిర్ణయించాం. కులసర్వేలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. తెలంగాణ సమాజం బలహీన వర్గాల రిజర్వేషన్ల విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారనే సందేశం ఈ సభ ద్వారా పంపించాలనుకున్నాం. ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. శాసన సభలో ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో పాటు అన్ని పార్టీలు మాతో కలిసి రావాలి" అని సీఎం విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు న్యాయపరమైన చిక్కులు లేకుండా చూడాలని బీఆర్ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిల్లులకు వారు సంపూర్ణ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచినట్టు కాంట్రాక్టుల్లో కూడా బీసీలకు వాటిని అమలు చేయాలనీ, అందుకు సంబంధించిన అంశాన్ని బిల్లులో చేర్చాలని కోరారు. కేంద్రంతో సంబంధం లేకుండానే కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయవచ్చునని సూచించారు. మల్లన్నసాగర్, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో కొనసాగుతున్న పనుల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీలకు రూ. 20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జీవో 9,18లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ బీసీ రిజర్వేషన్ బిల్లుకు, కాంట్రాక్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యుల తీరు కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కులగణన చేయడం సాహసోపేతమైన నిర్ణయమని చెప్పారు. ఇంటింటి సర్వే సమగ్రంగా చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతర కులాల ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అందుతాయన్నారు.

సభలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ పేరు మార్పుపై వాడీవేడి చర్చ జరగగా పేరు మార్పును బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యతిరేకించారు. పొట్టిశ్రీరాము లు పేరు ఎందుకు మార్చాల్సి వస్తుందని ప్రశ్నిం చారు. ఉస్మానియా యూనివర్సిటీకి సురవరం ప్రజాపరెడ్డి పేరును పెట్టాలంటూ ప్రభుత్వానికి సంచలన ప్రతిపాదన చేశారు. పొట్టి శ్రీరాములు ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన వ్యక్తి కాదని, దళితుల కోసం అనుచిత్వం పోరాటం చేసిన వ్యక్తి అన్నారు.



## వైద్యం అందించడంలో అలసత్వం తగదు..

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,వేములవాడ**

పేషెంట్లకు వైద్యం అందించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రి లోని అన్ని విభాగాలను, రోగులకు సేవలు అందిస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రతీ విభాగాన్ని కలియ తిరిగి వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరుని కలెక్టర్ పర్యవేక్షించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. రిజిస్టర్లు, ఔట్ పేషెంట్, ఐపి వార్డు, పిడియాట్రిక్ వార్డు, ల్యాబ్, ఫార్మసీ, ఐసీయూ, డయాలసిస్ విభాగాలను పరిశీలించి, మీ సమస్య ఏమిటి? ఎక్కడి నుండి వచ్చారు? ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారు అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి భవన నమూనాలో పేర్కొన్న విధంగా వార్డులు, గదులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో పర్యవేక్షకులు డా. పెంచలయ్య, వైద్య సిబ్బంది ,అధికారులు తదితరులు ఉన్నారు.



## కేసీఆర్, కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మారిన నాయకుల అహంకారం తగ్గటం లేదన్నారు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అవమానించే రీతిలో మాట్లాడిన జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేస్తే తప్పేమిటి అని అన్నారు.గతంలో మా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను మార్షల్ తో అసెంబ్లీ బయట వరకు గెంటి వేయించిన ఉదంతాలను సమాజం మర్చిపోలేదన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ప్రవర్తన చూస్తుంటే ఇంకా అధికారంలో ఉన్నట్టే మాట్లాడుతుండడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కనీసం సమస్యలపై చర్చించే ప్రతిపక్షం హెూదాను కూడా వారు స్వీకరించకపోవడం గమనార్హం అన్నాడు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీగా బాధ్యతాయుతంగా కొట్లాడడం నేర్చుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, డైరెక్టర్లు మిండేటి శ్రీనివాస్ యాదవ్ ,నారాయణరెడ్డి, చెట్టుపల్లి బాలయ్య, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు షేక్ గౌస్ వంగ గిరిధర్ రెడ్డి,చెన్ని బాబు, గంట బుచ్చ గౌడ్, అనవేణి రవి, మల్లారెడ్డి ,దేవయ్య, రాజు నాయక్ ,పరశురాములు, బాలు యాదవ్,ఎల్లాగౌడ్,రమేష్ నారాయణ,రవి బండారు, బండారి బాల్ రెడ్డి,సంతోషి గౌడ్, పందిర్ల శ్రీనివాస్,పాల్గొన్నారు.

# సిరిసిల్ల కాంగ్రెస్‌లో ఎక్కడ లోపం..?

- **టీపిసిసి ఆదేశాలు కూడా పట్టించుకోని సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు**
- **బీఆర్ఎస్ నేతలు జగదీష్ రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మల దహనంలో 30 మంది పాల్గొనని వైనం**
- **సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి సైతం గైహార్జరు**
- **పదవులు పొందిన లీడర్లు సైతం.. కార్యక్రమానికి రాని వైనం**
- **సిరిసిల్ల జిల్లా కేంద్రం ధర్నాలో 30 మంది పాల్గొంటే.. 15 మంది పక్క మండలాల వారే**
- **కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్టానం..**
- **సిరిసిల్ల కాంగ్రెస్ లో ఎవరికి వారే యమున తీరే**
- **రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అట్టర్ ప్లాప్..!**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఫెయిల్యూర్ గా మారుతుంది. సరియైన నాయకత్వం లేక.. కాంగ్రెస్ శ్రేణులు నైరాశ్యంలో పడిపోతున్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చిపోయే నాయకులతోనే కాంగ్రెస్ పార్టీ జనంలోకి వెళ్లలేకపోతుందని, ఎన్నికల్లో ఓట్లు రావడం లేదని చర్చ జరుగుతుంది. మొన్నటి వరకు షాడో సీఎంగా వ్యవహరించిన కేటీఆర్ ప్రతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తమ కార్యక్రమాల నిర్వహణలో పూర్తిగా ఫెయిల్యూర్ గా మిగలిపోతుంది. ప్రజల్లో నవ్వులపాలవుతున్నారు. అసెంబ్లీలో దళిత స్పీకర్ గడ్డ ప్రసాద్ ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఏకవచనంతో సంబోధించారని, అవమానించారని సస్పెండ్ చేశారు.దీంతో పాటు టీ పీసిసి మహేశ్‌గౌడ్ ఒక పిలుపునిచ్చారు. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్, కేసీఆర్, జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం చేయాలని. అధికారికంగా పిలుపునిచ్చిన కూడా సిరిసిల జిల్లా కేంద్రంలో కానీ, నియోజకవర్గంలోని ఏ మండలంలో కూడా సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి హాజరుకాకపోవడం రాజకీయంగా చర్చనీయంశం అవుతుంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణ కమిటి ఆధ్వర్యంలో ఈ దిష్టిబొమ్మల దహనం కార్యక్రమానికి సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే హాజరవుతునుకున్నారు. కానీ ఆయన హాజరు కాలేదు. సమాచార లోపమా...? కాంగ్రెస్ పార్టీకి క్యాడర్ లేకపోవడమా.. మరోక కారణమో తెలియదు కానీ.. కేవలం 30 మంది ఈ ధర్నా కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో ముస్తాబాద్ మండలం నుంచి కాంగ్రెస్ నేత చక్రధర్ రెడ్డి తో ఐదుగురు, తంగళ్లపల్లి కాంగ్రెస్ లీడర్లు ఐదుగురు, ఇంతర మండలాల నుంచి ఐదుగురు హాజరయ్యారు. మిగిలిన 15 మంది సిరిసిల్ల పట్టణం నుంచి హాజరయ్యారన్న మాట. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ లో ఎక్కడ లోపం జరుగుతుందో ఎవరికి అర్థం కావడం లేదు. అధికారిక కార్యక్రమాల్లో కూడా ఎక్కడ కాంగ్రెస్ క్యాడర్ కనిపించడం లేదు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎంసీ చైర్మన్ పోస్టులతో పాలు డైరక్టర్ పోస్టులు కూడా చాలా మందికి కేటాయించారు. కనీసం పదవులు వచ్చిన వారు కూడా హాజరైనట్లు కనిపించడం లేదు. కేవలం కాంగ్రెస్ సినియర్ నేత సంగీతం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ స్వూరప, జిల్లా మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, కల్లూరి చందన, గడ్డం కిరణ్ తో పాటు ఒకరిద్దరు హాజరయ్యారు. అధికార పార్టీ ఐ ఉండి.. రాష్ట్ర నాయకత్వం పిలుపునిస్తే.. జిల్లా కేంద్రంలో కనీసం 30 మంది కూడా హాజరుకాకపోవడం ఏంటని పలువురు చర్చించుకోవడం కనిపించింది. సిరిసిల్ల కాంగ్రెస్ లో నాయకులు ఏదైన అత్యవసర పనిపడి హాజరుకాకున్న తమ క్యాడర్ ఐన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటారు. కానీ ఇక్కడ అది కూడా లేకపోవడం తో కాంగ్రెస్ పార్టీ పరువు గంగలో కలిసినట్లయింది. 30 మంది కాంగ్రెస్ శ్రేణుల అందోళనకు 20 మంది పోలీసుల బందోబస్తు నిర్వహించడం కనిపించింది. తంగళ్లపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్(టోని) ని ఒక సంఘటనలో సిరిసిల్ల పోలీసులు ముందస్తు అరెస్టు చేస్తే ఆయన్ని చూడటానికి, పరామర్శించడానికి తంగళ్లపల్లి మండలం నుంచి 50 మందికి పైగా ఠాణాకు రావడం విశేషం. కనీసం అధికారిక ధర్నాలో 30 మంది లేకపోవడం శోచనీయం.

**సిరిసిల్ల పట్టణంలో లక్షా జనాబాలో కాంగ్రెస్ మెంబర్ షిప్ 1000 లేదా..?**

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పట్టణ జనాబానే లక్షాకు పైగా ఉంటుంది. కాంగ్రెస్ నాయకులు వాట్సప్ మేసేజ్ పెట్టి కార్యక్రమానికి హజరుకండి అని చెప్పిన వార్డుకు పది మంది వచ్చిన ఈజీగా 39 వార్డులకు గాను 390 మంది హాజరవుతారు. కాంగ్రెస్ పట్టణ కమిటి మొత్తం హజరైన.. కనీసం 30 మంది దాటుతారు.. సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ కు కనీసం 1000 మెంబర్ షిప్ లేదా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాలను చూస్తే. ఏది ఏమైన సిరిసిల్ల కాంగ్రెస్ లో గ్రూపు రాజకీయాలతో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కు లేకుండా పోయారన్న ఆరోపణలు వస్తున్నాయి. కాంగ్రెస్ క్యాడర్ ను, కార్యకర్తలను సమన్వయం చేసే నాధులు కరువయ్యారని స్పష్టంగా అర్థమవుతుంది. ఎవరికి వారే మయున తీరే అన్న చందంగా ఎవరి పని వారు చేసుకుపోతున్నారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు అయోమయంలో పడిపోతున్నారు. ఏమైన కార్యక్రమం ఐన కనీసం ఫోన్ చేసి రండి అని చెప్పే వారు కరువవుతున్నరని పేర్కొంటున్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే...

- **గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 18 ఫిర్యాదులు స్వీకరణ..**
- **ఎస్పీ మహేష్. బి.గితే**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు.సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బాధ్యతలు నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మహేష్. బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.



## అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 113 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ మాస్టర్స్ విజేత భారత్

## ఫైనల్లో వెస్టిండీస్ మాస్టర్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘనవిజయం




**బలగం టీవీ, హైదరాబాద్**

మాజీ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ టీ20 తొలి సీజన్ టైటిల్‌ను సచిన్ టెండూల్కర్ సారథ్యంలోని ఇండియా మాస్టర్స్ గెలుచుకుంది. ఆదివారం రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో వెస్టిండీస్ మాస్టర్స్‌పై విజయం సాధించింది.

మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన బ్రియాన్ లారా సారథ్యంలోని వెస్టిండీస్.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 148 పరుగులకే పరిమితమైంది. సిమ్మన్స్ (41 బంతుల్లో 57బీ 5 ఫోర్లు, 1 సిక్స్), డ్వైన్ స్మిత్ (35 బంతుల్లో 45బీ 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. భారత బౌలర్లలో వినయ్ కుమార్ 3, నదీమ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత మాస్టర్స్ జట్టు 17.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. ఓపెనర్ అంబటి తిరుపతి రాయుడు (50 బంతుల్లో 74బీ 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో విజృంభించగా... కెప్టెన్ సచిన్ టెండూల్కర్ (25బీ 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. యువరాజ్ సింగ్ (13 నాటౌట్), గుర్‌కీరత్ సింగ్ (14), స్టువర్ట్ బిన్నీ (16 నాటౌట్) పరుగులు చేశారు.

## ఢిల్లీ క్యాపిటల్స్ వైస్ కెప్టెన్‌గా డు ప్లెసిస్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త వైస్ కెప్టెన్‌గా దక్షిణాఫ్రికా ఆటగాడు ఫాఫ్ డు ప్లెసిస్‌గా నియమించింది. ఈ మేరకు ఎక్స్‌లో వీడియో పోస్ట్‌తో ప్రకటించింది. 'వైస్ కెప్టెన్ ఫోన్ చేస్తున్నడు.. మీ ఫోన్స్ లిఫ్ట్ చేయండి' అనే క్యాప్షన్‌తో డీసీ వీడియోను షేర్ చేసింది. ఇటీవల కెప్టెన్‌గా టీమిండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. బ్యాటింగ్ లైనప్‌లో డు ప్లెసిస్ స్థానంపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌తో కలిసి ఓపెనింగ్ చేయవచ్చని పలువురు భావిస్తుండగా.. కేఎల్ రాహుల్ మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ రావొచ్చని పలువురు అంచనా వేస్తున్నారు.

డు ప్లెసిస్ 2012లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 2021 సీజన్ వరకు ఆ ఫ్రాంఛైజీతోనే ఉండగా.. 2022 నుంచి 24 వరకు మూడు సీజన్లలో రాయల్ చాలెంజర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు.



## సంక్రాంతికి అనిల్ రావిపూడి-చిరంజీవి సినిమా

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి సినిమాతో 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి ప్రకటించారు. ఆదివారం సింహాచలం లక్ష్మీ నరసింహస్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఆయనతో పాటు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో కూడా ఉన్నారు. చిరుతో తీయబోయే మూవీ స్క్రిప్ట్ స్వామి సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజల అనంతరం అనిల్ రావిపూడి విలేకర్లతో మాట్లాడారు. తన సినిమా కథలకు విశాఖను తాను సెంటిమెంట్‌గా భావిస్తానని తెలిపారు. అందుకే మెగాస్టార్‌తో తీయబోయే చిత్రానికి సంబంధించిన కథను సిద్ధం చేసేందుకు వైజాగ్ వచ్చినట్లు వెల్లడించారు. ఇక చిరుతో తీసే మూవీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందన్నారు. ఘరానా మొగుడు, గ్యాంగ్‌లీడర్, రౌడీ అల్లుడు సినిమాల్లోని చిరంజీవి మేనరిజం ఇందులో ఉంటాయని పేర్కొన్నారు. ఒక నెలలో స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసి, మే చివర్లో లేదా జూన్ మొదటి వారంలో మూవీ షఉటింగ్ ప్రారంభిస్తామని అనిల్ రావిపూడి తెలిపారు.



## అర్జున్ S/O వైజయంతి టీజర్ విడుదల..

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం అర్జున్ సన్నాఫ్ వైజయంతి . కొత్త దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాలో సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించగా.. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ మూవీలో విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్ గానే కనిపిస్తోంది. ఆమె కొడుకు పాత్రలో కళ్యాణ్ రామ్ కనిపించాడు. ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టని వైజయంతి కొడుకు విషయంలో ఏం చేసింది అనే కోణంలో సాగే కథలా సినిమా ఉంటుందని టీజర్‌ని చూస్తే అర్ధమవుతుంది.



## ఆగస్టు 14న 'వార్-2'

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఎన్టీఆర్ ఆ తర్వాత దేవర అనే సినిమా చేశాడు. ఈ సినిమా మంచి విజయం సాధించింది. ఇక వార్2 చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చాడు. ఇందులో బాలీవుడ్ టాప్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడు.ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ వస్తున్నారు. అయితే ఈ సినిమా చిత్రీకరణ సందర్భంగా హృతిక్ రోషన్ గాయపడడంతో షెడ్యూళ్లు అన్నీ డిస్టర్బ్ అయ్యాయని.. ముందు అనుకున్నట్లుగా ఈ ఏడాది ఇండిపెండెన్స్ డే వీకెండ్లో ఈ చిత్రం విడుదల కాదని మీడియాలో జోరుగా వార్తలు వచ్చాయి. దీంతో హృతిక్, తారక్ ఫ్యాన్స్ నిరాశ చెందారు. కానీ ఆ నిరాశను పోగొడుతూ చిత్ర నిర్మాణ సంస్థ 'యశ్ రాజ్ ఫిలిమ్స్' రిలీజ్ డేట్‌పై అధికారిక ప్రకటన చేసింది. 'వార్-2' ఈ ఏడాది ఆగస్టు 14న రిలీజ్ కాబోతున్నట్లు యశ్ రాజ్ ఫిలిమ్స్ సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా స్పష్టం చేసింది. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయినట్లు సమాచారం. ఇంకో రెండు నెలల్లో షూట్ అంతా అయిపోతుంది. జూన్ నుంచి ప్రి ప్రొడక్షన్ పనులు, ప్రమోషన్లు సమాంతరంగా మొదలవుతాయి. హృతిక్-టైగర్ ష్రాఫ్ కాంబినేషన్లో సిద్ధార్థ్ ఆనంద్ 'వార్' చిత్రాన్ని రూపొందించగా.. 'వార్-2'లో మరో హీరోగా ఎన్టీఆర్ వచ్చాడు. దర్శకత్వ బాధ్యతలు 'బ్రహ్మాస్త్ర' దర్శకుడు అయాన్ ముఖర్జీ తీసుకున్నాడు. యశ్ రాజ్ ఫిలిమ్స్ వారి స్పై యూనివర్శ్‌లో భాగంగానే ఈ చిత్రం కూడా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. అనిల్ కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నాడు.




## కూలీ' షూటింగ్ పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**


సూపర్ స్టార్ రజనీకాంత్- లోకేశ్ కనగరాజ్ కాంబోలో తెరకెక్కుతున్న మూవీ 'కూలీ'. అక్కినేని నాగార్జున, ఉపేంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఈ సినిమాను యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తైనట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ మేరకు ఓ స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు. 'ఇట్స్ సూపర్ రాప్ ఫస్ కూలీ' అని క్యాప్షన్ రాసుకొచ్చారు. ఇక షూటింగ్ సమయంలో బ్యాక్‌గ్రౌండ్ సీన్స్‌ను గ్లింప్స్‌ను వీడియోలో చూపించారు. ఇందులో రజనీకాంత్‌తోపాటు నాగార్జున కూడా కనిపించారు. శ్రుతిహాసన్ ఫీమేల్ లీడ్‌లో కనిపించనున్నారు. ఇంకా సత్యరాజ్ కీలక పాత్ర పోషించగా, పూజా హెగ్డే స్పెషల్ సాంగ్‌లో ఆడిపాడనున్నారు. మ్యూజికల్ సెన్సేషన్ అనిరుధ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్?తో నిర్మిస్తున్నారు. ఇక షఉటింగ్ కంప్లీట్ అవ్వడం వల్ల, మూవీటీమ్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉండనుంది. అయితే విడుదల తేదీని మేకర్స్ ఇంకా ప్రకటించలేదు. కానీ, మే 1 రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా 'కన్నప్ప' మూడో పాట విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి థర్డ్ సింగిల్ అప్డేట్ వచ్చింది. 'మహాదేవ శాస్త్రి పరిచయ గీతం'ను మార్చి 19న మోహన్ బాబు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆవిష్కరించనున్నారు. మోహన్ బాబు ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించడమే కాకుండా మహాదేవ శాస్త్రి పాత్రను కూడా పోషించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ పాటను విడుదల చేయనున్నారు. మోహన్ బాబుతో పాటుగా ఈ చిత్రంలో మంచు విష్ణు, ప్రీతి ముకుందన్, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, ముఖేష్ రిషి, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు. సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన పాటలు ఇప్పటికే శ్రోతలను అలరించాయి. ఇక ఇప్పుడు మూడో పాటగా మహదేవ శాస్త్రి పరిచయ గీతాన్ని విడుదల చేయనున్నారు. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రాన్ని ముకేశ్ కుమార్ సింగ్ తెరకెక్కించారు. ఏప్రిల్ 25న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.




## నరేశ్ కొత్త సినిమా '12ఎ రైల్వే కాలనీ'

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ హీరో అల్లరి నరేశ్- నాని కాసరగడ్డ కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతోంది. 'పొలిమేర', 'పొలిమేర 2' రైటర్ నుంచి ఈ సినిమా సిద్ధమవుతోంది. ఇప్పటికే షఉటింగ్ ప్రారంభమైంది. తాజాగా మేకర్స్ ఓ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. అలాగే సినిమా టైటిల్ కూడా అనౌన్స్ చేశారు. ఈ సినిమాకు '12ఎ రైల్వే కాలనీ' అనే పేరును ఫిక్స్ చేసినట్లు సోషల్ మీడియాలో వెల్లడించారు. 'ఈ ఆత్మలు కొంతమందికే ఎందుకు కనిపిస్తాయి. అందరికీ ఎందుకు కనిపించవు' అనే డైలాగ్స్‌తో టీజర్ మొదలైంది. 'ప్రాణాలతో బయటకు పోవుడు అవసరం లేదన్న!' అంటూ వీడియో చివర్లో నరేశ్ చెప్పే డైలాగ్స్? ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్ చూస్తుంటే ఇది హార్రర్ జానర్?లో తెరకెక్కుతున్నట్లు అర్థం అవుతోంది. మరి మీరు ఈ వీడియో చూశారా?